

బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సుపై శిక్షణ

గుజరాతీపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సత్య సాయిబాబా సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సుపై శిక్షణ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ కోర్సుకు పదోతరగతి, విద్యార్హత ఉన్న 18-30 ఏళ్లలోపు మహిళలు అర్హులు. ఈ నెల 28లోగా 94403 98049, 83319 00152 నెంబర్లను సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసి రెసిడెన్షియల్, డే స్కాలర్ పద్ధతిలో శిక్షణ కల్పిస్తామ'ని నిర్వాహకులు స్పష్టం చేశారు.

బీపీ.. షుగర్.. పెరిగిపోతున్నాయ్!



- గ్రామాల్లో వ్యాపిస్తున్న వ్యాధులు
- మారుతున్న ఆహారపు అలవాట్లు..
- జీవనశైలి కారణమంటున్న వైద్యులు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు

వజ్రపుకొత్తూరు మండలంలోని ఓ గ్రామంలో 30 ఏళ్ల యువకుడు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇటీవల కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడ్ని ఆశ్రయించాడు. ఆ డాక్టర్‌కు అనుమానం వచ్చి షుగర్ పరీక్షలు చేయించగా 150 ఎంజీ డీఎల్ వచ్చింది. దీంతో మరుసటి రోజు ఉదయం మరోసారి ఖాళీ కడుపులో పరీక్షలు చేయగా షుగర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ మేరకు మందులు వాడాలని సూచించారు. కాగా.. తమ కుటుంబంలో ఎవరికి షుగర్ వ్యాధి లేదని యువకుడు చెప్పగా.. ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడే దీనికి కారణమని వైద్యుడు స్పష్టం చేశారు. ఫాస్ట్‌ఫుడ్‌కు తీసుకోరాదని సూచించారు.

వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన 26 ఏళ్ల జవాన్.. విధి నిర్వహణలో చురుగ్గా ఉండేవారు. ఇటీవల ఆయనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో వైద్యులను సంప్రదించారు. బీపీ అధికంగా ఉందని ఉప్పు, కారం తగ్గించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ మాటలను పెడచెవిన పెట్టిన జవాను కొద్దిరోజుల తర్వాత మరింత అనారోగ్యానికి గురయ్యారు. విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. వైద్యుల సూచన మేరకు బీపీ నివారణ మందులు రోజూ వాడుతున్నారు.

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీపీ, షుగర్ వ్యాధి బాధితులు పెరిగిపోతున్నారు. ప్రతి ఇంట్లోనూ ఒకరిద్దరికి ఈ రెండూ ఉండడం సర్వసాధారణమై పోయింది. వీటి బారిన పడినవారు కొందరు క్రమేపీ గుండె, కిడ్నీ సమస్యలతో బాధపడుతూ మృత్యువాత పడుతున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా సరైన ఫలితాలు ఉండడం లేదు. ప్రధానంగా ఉద్దానం ప్రాంతంలో దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలుతుండడం ఆందోళన కల్గిస్తోంది. 30 ఏళ్లు దాటిన యువత కూడా ఈ వ్యాధుల బారిన పడడం కలవరపాటుకు గురిచేస్తోంది. 2021 గణాంకాల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 30శాతం మందికి, పల్లెల్లో 16 శాతం మందికి బీపీ, షుగర్ వ్యాధులు సోకుతున్నట్లు తేలింది. ఈ సంఖ్య ప్రస్తుతం రెట్టింపుగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి తదితర కారణాలతో బీపీ, షుగర్ బాధితులు గ్రామాల్లో సైతం పెరుగుతున్నారని పేర్కొంటున్నారు. మారుతున్న కాలంతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పు రావాలని సూచిస్తున్నారు. లేదంటే ప్రాణ నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యానికి తిండి, నిద్ర చాలా ముఖ్యం. వాటిని ప్రధానంగా యువత నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆ ప్రభావం భవిష్యత్‌పై పడుతోంది. విద్యార్థుల్లో కూడా మానసిక ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో కొంత మంది రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. రక్తహీనతను తట్టుకుని ముందుకు వెళ్లాలంటే పౌష్టికాహారం కీలకం. ఈ విషయాన్ని విస్మరిస్తున్నారు. ఇంటి వద్ద ఆహారం సరిగా తినకుండా.. బయట దుకాణాల్లో జంక్ ఫుడ్ తీసుకుంటున్నారు. పిజ్జా, బన్‌లు, కేక్‌లు, పానీపూరి, నూడిల్స్ వంటివి తినేందుకు ఆసక్తి చూపుతూ.. రాత్రివేళ కూడా చాలామంది భోజనం మానేస్తున్నారు. ఈ విధానం అనారోగ్యానికి దారి తీస్తోంది. అలాగే చిన్నారుల నుంచి పెద్దల వరకూ చాలామంది టీవీలు, సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తూ సమయానికి నిద్రపోవడం లేదు. దీంతో కళ్ల సమస్యలు కూడా వస్తున్నాయి. ప్రతిఒక్కరూ రోజుకు కనీసం 7 గంటలు నిద్రపోతేనే ఆరోగ్యమని వైద్యులు చెబుతున్నారు.

వ్యాయామం తప్పనిసరి

గతంలో గ్రామాల్లో పొలం, తోటలకు నడిచి వెళ్లేవారు. ప్రస్తుతం వాహనాలపై వెళ్తున్నారు. దీంతో శారీరక వ్యాయామం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా చాలా మందికి బీపీ, షుగర్ సర్వసాధారణమైపోయింది. ఇటీవల గుండె జబ్బులతో మృతి చెందిన వారి సంఖ్య కూడా పెరుగుతోంది. మరికొన్ని గ్రామాలలో (మిగతా 6వ పేజీలో..)




అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)


ఎలా వండాలి.. ఎక్కడ్నుంచి తేవాలి?

- అంగన్‌వాడీ కేంద్రాలకు అందని కూరగాయలు, పోపు దినుసులు
- 11 నెలలుగా మంజూరుకాని బిల్లులు
- ఆందోళన చెందుతున్న నిర్వాహకులు

మెళియాపుట్టి మండలం దీనబంధుపురం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు ఏడుగురు ఉన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 8 మందితో పాటు బాలింతలు, గర్భిణులు ఒక్కొక్కరూ ఉన్నారు. వీరికి పౌష్టికాహారం అందించేందుకుగానూ బిల్లులు సక్రమంగా అందడం లేదు. గతేడాది మార్చి నుంచి గ్యాస్ సిలిండర్‌తోపాటు కూరగాయలు, పోపులకు సంబంధించిన బిల్లుల బకాయి ఉంది. అప్పు చేసి చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు భోజనం పెడుతున్నామని నిర్వాహకురాలు దమయంతి వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లుల బకాయిలు విడుదల చేయాలని కోరుతున్నారు.

మెళియాపుట్టి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులకు మధ్యాహ్న భోజన నిర్వహణ భారమవుతోంది. ఓ వైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు కూరగాయలు, పోపు దినుసులు, గ్యాస్ తదితర వాటికి 11 నెలల నుంచి బిల్లులు మంజూరు కావడం లేదు. దీంతో వంట చేసేది ఎలా? అని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 39,085 మంది ఉన్నారు. వీరితోపాటు 13,275 మంది బాలింతలు, 12,229 మంది గర్భిణులు ఉన్నారు. వీరికి ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాల్లో రుచికరమైన భోజనం అందించాల్సి ఉంది. వారానికి రెండు రోజుల పాటు ఫ్రైడ్‌రైస్, సాంబారు, కూర వండాలి. మిగిలిన (మిగతా 6వ పేజీలో..)

రైతులకు 'గుర్తింపు'



- ప్రత్యేక కార్డుల జారీకి చర్యలు
- నమోదు ప్రక్రియ ప్రారంభం

నరసన్నపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రైతులకు గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతీ రైతుకు 'ఆధార్' మాదిరి 14 అంకెలతో కూడిన ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తూ గుర్తింపు కార్డులు జారీకి చర్యలు చేపడుతోంది. ఈ కార్డుల ద్వారా రైతులకు సంక్షేమ పథకాలతోపాటు పంట నష్టం, బీమా పరిహారం తదితర సేవలను పారదర్శకంగా అమలు చేయనుంది. వాతావరణంలో మార్పులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించి అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టనుంది. ఈ సంఖ్య ప్రామాణికం కానున్న నేపథ్యంలో రైతులంతా.. 'ఫార్మర్ రిజిస్ట్రేషన్' చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో 3.72 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరంతా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. ఆధార్, పట్టాదారు పుస్తకాల జిరాక్స్‌లను గ్రామ వ్యవసాయ సహాయకుడికి అందించాలి. ఆ వివరాలను వీఏఏ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రైతుకు చెందిన సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నెంబర్‌తో వీఏఏ లాగిన్ ద్వారా రైతుల వివరాలను సరిచూస్తారు. పాస్‌పుస్తకాల్లో ఉన్న వివరాలు సరిపోలితే 14 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు అందిస్తారు. ఒకవేళ రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోతే వీఆర్వో లాగిన్‌కు వెళ్తుంది. వీఆర్వో సరిచూసి.. తహసీల్దార్‌కు వివరాలు పంపిస్తారు. వాటిలో తప్పులను రికార్డుల మేరకు సరిచేసిన తరువాత వీఏఏకు పంపిస్తారు. ప్రస్తుతం నమోదు ప్రక్రియ సాగుతోంది. రైతులు తగు ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని నరసన్నపేట ఏడీఏ రవీంద్ర భారతి తెలిపారు. ప్రత్యేక గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు.

ప్రయోజనాలివీ..

రైతులకు గుర్తింపు కార్డుల ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. భూమి గల రైతులను త్వరగా గుర్తించేందుకు ఇవి దోహదపడతాయి. ప్రభుత్వ రాయితీలు, పంటల బీమా వర్తిస్తాయి. భూ ఆధారిత రైతు పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, వ్యవసాయ పరికరాలు తదితర పథకాలను నేరుగా పొందవచ్చు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే సత్వరమే పరిహారం అందించేందుకు అవకాశం ఉంది. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతవరణ సూచనలు వంటి ఇతర సేవలు కూడా పొందవచ్చు.


ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వద్ద పనులపై ఆరా తీస్తున్న వంశధార ఎస్ఈ తిరుపతిరావు

'ఆఫ్‌షోర్' జాప్యం ఎందుకు?

- రైతులు, కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారు కదా!
- పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి
- వంశధార ఎస్ఈ తిరుపతిరావు ఆదేశాలు

పలాస/ పలాస రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు నిలిచిపోవడానికి కారణం నీటిపారుదలశాఖ అధికారులదే తప్పు. పనులు చేయడానికి కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారు. రైతుల సమస్యలు కూడా ఏవీ లేవు. మొత్తం అంశాలు పరిశీలించి రిజర్వాయర్ పనులు సకాలంలో పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటామ'ని వంశధార ఎస్ఈ వీవీ తిరుపతిరావు తెలిపారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ జలాశయాన్ని పరిశీలించారు. రైతులు, నిర్వాసితులు, అధికారులు, నీటి సంఘం సభ్యులతో మాట్లాడి.. పనుల పరిస్థితిపై ఆరా తీశారు. వంశధార ఈఈ శేఖర్‌బాబు మాట్లాడుతూ.. 'ఇప్పటివరకూ 43 శాతం పనులు జరిగాయి. మెళియాపుట్టి మండలం చాపర నుంచి పలాస మండలం రేగులపాడు వరకూ 14 కిలోమీటర్ల వరద కాలువ నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికి 6.9 కిలోమీటర్లు నిర్మించాం. ప్రస్తుతం ఆర్‌ఓఆర్ కాలనీ నిర్వాసితులకు సమస్యలు ఉన్నాయి. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కొంతమంది నిర్వాసితులకు స్థలం కేటాయించాల్సి ఉంద'ని తెలిపారు. దీనిపై ఎస్ఈ తిరుపతిరావు స్పందిస్తూ.. ఆఫ్‌షోర్‌పై పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు పనులు నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. 'కాంట్రాక్టర్లు, రైతులు సముఖంగా ఉన్నా.. ఇరిగేషన్ అధికారుల తప్పుల కారణంగా పనుల్లో జాప్యమైంది. దీన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. సకాలంలో పనులు పూర్తి చేస్తామ'ని ఎస్ఈ తిరుపతిరావు (మిగతా 6వ పేజీలో..)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పదిమంది నామినేషన్

- నేడు నామినేషన్ల పరిశీలన
- ఉపసంహరణకు 13 వరకూ గడువు
- 27న పోలింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం గడువు ముగిసే సమయానికి మొత్తం పది మంది నామినేషన్ వేశారు. చివరిరోజు ఇద్దరు(పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు) మూడు సెట్ల వంతున నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలు అనంతరం అభ్యర్థులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ప్రమాణం చేయించారు. ఈనెల 27వ తేదీన జరగనున్న ఎన్నికలకు ఈ నెల మూడో తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మొత్తం పది మంది అభ్యర్థులు...సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కోరెడ్ల విజయగౌరి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, గాదె శ్రీనివాసులనాయుడు, పోతల దుర్గారావు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన చేస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 13వ తేదీ వరకూ గడువు ఉంది. కాగా ఈ ఎన్నిక పార్టీ రహితంగా జరుగుతుంది. అందుకే బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించరు. బ్యాలెట్‌పై పేరు, ఫొటో మాత్రమే ఉంటాయి.

ముగ్గురికి ప్రాణదానం చేసిన బాలుడు

- బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవదానానికి తల్లిదండ్రుల అంగీకారం

6లో

తర్లాకోట.. చెదిరిన ఆనవాళ్లు


శిథిలావస్థలో తర్లాకోట సంస్థానం

- చారిత్రక కట్టడం కనుమరుగు
- విలువైన సంపద దొంగల పాలు
- గుప్తనిధుల కోసం కోట ధ్వంసం
- పరిరక్షించాలని కోరుతున్న ప్రజలు

← శిథిలావస్థలో తర్లాకోట సంస్థానం

6లో



వరిసాగుకే మొగ్గు

- రబీలో పంట వేసేందుకు సమాయత్తం
- ఇప్పటికే 4వేల హెక్టార్లలో సాగు

6లో



6లో

అతిథుల సందడి

- బూరవల్లిలో విదేశీ పక్షుల సందడి
- సంతానోత్పత్తికి సైబీరియా నుంచి రాక



అతిథుల సందడి

● బూరవెల్లిలో విదేశీ పక్షుల కిలకిలలు
● సంతానోత్పత్తికి సైబీరియా నుంచి రాక
● ఏప్రిల్, మే నెలల్లో పిల్లలతో తిరుగుపయణం

గార, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బూరవెల్లిలో సైబీరియా పక్షులు సందడి చేస్తున్నాయి. దశాబ్ద కాలంగా ఏటా డిసెంబరులో వచ్చి సంతానోత్పత్తి అనంతరం పిల్లలతో స్వస్థలానికి వెళ్లిపోతుంటాయి. రెండు నెలల కిందట ఇక్కడకు చేరుకున్న సుమారు 300 పెలికాన్ పక్షులు గ్రామ సమీపంలో ఉన్న చెట్లపై గూళ్లను ఏర్పాటు చేసుకున్నాయి. గుడ్లు పెట్టి పిల్లలు పెద్దవయ్యే వరకూ చెట్లపై ఏర్పాటు చేసిన గూళ్లలోనే ఉంటాయి. పక్షులు రోజంతా ఆహారం కోసం సమీపంలోని వంశధార నది పరివాహక ప్రాంతంలో వేట సాగించి దొరికిన ఆహారాన్ని తీసుకొచ్చి పిల్లలకు అందిస్తున్నాయి. సుమారు ఐదు నెలల పాటు ఈ విదేశీ పక్షులు సందడి చేస్తుంటాయి. పిల్లలతో ఏప్రిల్, మే నెలల్లో సైబీరియా వెళ్లిపోతాయని గ్రామస్థులు చెబుతున్నారు. వంశధార నది గ్రామానికి ఆనుకుని ఉండడం, వేటకు అనుకూలంగా ఉండడంతో ఇక్కడ పెలికాన్ పక్షులు వస్తున్నట్టు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ పక్షుల సంరక్షణకోసం అటవీశాఖ అధికారులు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటే ఇక్కడ పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశముందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వరిసాగుకే మొగ్గు

● రబీలో పంట వేసేందుకు సమాయత్తం
● ఇప్పటికే 4వేల హెక్టార్లలో సాగు

టెక్కలి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతాంగానికి సాగునీటిని అందించలేమని, నీటి వనరులు కూడా అంతంత మాత్రమే ఉన్నాయని. రైతులు వరిసాగుకు దూరంగా ఉండాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ముందే హెచ్చరించారు. అయితే రైతులు మాత్రం ఈసారి పదివేల హెక్టార్లలో వరి పంట వేశారు. రబీలో సగటు సాగు విస్తీర్ణం 8,600 హెక్టార్లు అయితే ఈసారి దానికి మించి వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సుమారు 4వేల హెక్టార్లలో సాగు చేసినట్లు సమాచారం. జిల్లాలో అత్యధికంగా రబీ వరిసాగు నందిగాం మండలంలో ఉంది. అలాగే సంతబొమ్మాళి, టెక్కలి, కోటబొమ్మాళి, పాతపట్నం, నరసన్నపేట, జలుమూరు, సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, హిరమండలం, ఎచ్చెర్ల, గార, పోలాకి, సారవకోట తదితర మండలాల్లో కూడా అత్యధికంగా ఉంటుంది. గత ఏడాది డిసెంబరు నెలలో అకాల వర్షాలు కురిసి చెరువులు, వాగులు, గెడ్డల్లో నీరు కనిపించడంతో పాటు వంశధార ప్రధాన ఎడమ కాలువలో 165 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండడంతో రైతులు రబీ వరిసాగుకు మొగ్గు చూపారు.

● రైతులు రబీ వరిసాగులో సన్నరకాలు.. 110 రోజుల వ్యవధి ఉన్న ఆర్ఎన్ఆర్-15048 రకం ఎక్కువగా సాగు చేస్తున్నారు. మరికొన్నిచోట్ల 1010, 1156 రకాలు కూడా వేస్తున్నారు. అయితే ఆర్ఎన్ఆర్-15048 రకానికి అధిక ధర పలుకుతుండడంతో రైతులు వీటిపై కూడా మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది రిజర్వాయర్, కాలువల్లో మరమ్మతులు జరిపించాల్సి ఉందని, రబీ సీజన్‌లో సాగునీరు అందించలేమని జిల్లా ఇరిగేషన్ ఎడ్వైజరీ బోర్డు సమావేశంలో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కానీ రైతులు రబీ వరిసాగుపై దృష్టి సారించారు. రబీ వరిసాగుకు రైతు సేవా కేంద్రాల్లో యూరియా కూడా అందుబాటులో లేకపోయినా.. రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నారు.



టెక్కలి సమీపాన వంశధార కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

ఆరుతడి పంటలు వేసుకోవాలి

జిల్లాలో ఏటా 8,600 హెక్టార్ల పరిధిలో రబీసాగు జరిగేది. డిసెంబరు నెలలో కురిసిన వర్షాలకు నీటి వనరులు లభ్యం కావడంతో రైతులు రబీ వరిసాగుపై దృష్టి సారించారు. రబీలో నీరు అందించలేమని ముందస్తు సమాచారం కూడా ఇచ్చాము. ఆరుతడి పంటలను వేసుకోవాలని చెప్పాము.

- త్రినాథస్వామి, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు



నందిగాం మండల పరిధిలో రబీ వరిసాగు

భూ సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కొత్తూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చే భూ సమస్యలపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండలంలోని కంచాలుపేటలో గల ఓ ప్రైవేటు మండపంలో సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు గాను ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వంటశాలను పరిశీలించి అపరిశుభ్రంగా ఉండడంతో వంట కార్మికులను ప్రశ్నించారు. మీ ఇంటిలో వంట సామగ్రిని ఇలాగే ఉంచుతారా అని ప్రశ్నించారు. వంట కార్మికులపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎం డీఎల్ నరసింహంను ఆదేశించారు. పాఠశాలలో ఉన్న మురుగనీరు వెళ్లేందుకు కాలువ నిర్మాణం చేపట్టాన్నారు. 100 కంటే ఎక్కువ ఫిర్యాదులు ఉంటే ఆర్డీవో లేదా జేసీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని చర్యలు తీసుకునేందుకు సమీక్ష సమావేశమని తెలిపారు. జిల్లాలో 67 గ్రామాల్లో భూ సమస్యలున్నట్టు గుర్తిం చామని, 40 ఫిర్యాదులుంటే తహసీల్దార్ స్వయంగా వెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. ల్యాండ్ బ్యాం కులకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను గడువు తేదీలోగా మంజూరు చేయాలన్నారు. రీసర్వేలను సమగ్రంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ రవిచంద, ఎంపీడీవో నీరజ, కురిగాం సీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



వంటశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి

● జిల్లా అదనపు న్యాయాధికారి భాస్కరరావు

గుజరాతీపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు గుర్తించి వారికి సకలాంగులు తరహాలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని జిల్లా అదనపు న్యాయాధికారి పి.భాస్కరరావు కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని కోర్టు ప్రాంగ ణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ దివ్యాంగుల గుర్తించే కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి విభిన్న ప్రతిభావంతులు గుర్తిస్తామన్నారు. పలు శాఖల జిల్లా అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, పానెల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు, అంగన్‌వాడీలు, ఎఎన్ఎంలు, ఇతర సిబ్బంది సమక్షంలో సర్వేను నిర్వహిస్తామని తెలిపారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రంలో న్యాయాధికారులు సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఎం.ఫణికుమార్, సీహెచ్ యుగంధర్ పాల్గొన్నారు.



డోర్ టు డోర్ దివ్యాంగులను గుర్తించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారులు

ప్రధాని సూచనలు పాటించండి

● జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య

గుజరాతీపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఇచ్చిన విలువైన సూచనలు ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య పిలుపునిచ్చారు. కాలాన్ని సద్వినియోగంచేసుకుని, ప్రణాళిక బద్ధంగా విద్యనభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పరీక్ష పే చర్చ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం తిరుమల చైతన్య మాట్లాడుతూ ప్రధాని మోడి విద్యార్థుకు ఇచ్చిన సందేశం స్ఫూర్తినింపుతుందని తెలిపారు. జిల్లాలోని ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతన్న లక్షా యాభై వేల మంది విద్యార్థులు కార్య క్రమాన్ని తిలకించేలా ఏర్పాట్లు చేశామని, 30 మండలాల్లో పరీక్షా పే చర్చ లైవ్ ప్రోగ్రాం నిర్వహించామని చెప్పారు.



పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో తిరుమల చైతన్య

'ఆఫ్‌షోర్' జాప్యం ఎందుకు?

(ఐదో పేజీ తరువాయి)

తెలిపారు. అనంతరం ఆయనను నీటిసంఘ అధ్యక్షుడు గొనప నిరంజన్‌తో పాటు నీటిసంఘ ప్రతినిధులు, రైతులు సత్కరించారు. ఈ ప్రాంతమంతా వ్యవసాయ ఆధారిత భూములని, రిజర్వాయర్ పూర్తయితే ఆ నీటితో పుష్కలంగా పంటలు పండే అవకాశం ఉందని వారు వివరించారు. ప్రభుత్వ అనుమతులతో పనులు పూర్తి చేస్తామని వారికి ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో వంశధార డీఈలు కె.నవీన్, వి.సుధాకర్, ఎఈలు రాజశేఖర్, మీనాక్షి, నీటి సంఘం సభ్యులు గొనప నిరంజన్, పరిశ తారకేశ్వరరావు, విష్ణు మురళీకృష్ణ, విశ్వనాథం, టీడీపీ నాయకులు, రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురికి ప్రాణదానం చేసిన బాలుడు

● బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవదానానికి అంగీకరించిన తల్లిదండ్రులు

సంతబొమ్మాళి/ విశాఖపట్నం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆడుతూ పాడుతూ చదువుకునే వయసులోని ఓ బాలుడికి అరుదైన వ్యాధి సోకడంతో బ్రెయిన్‌డెడ్ అయింది. అంతటి విషాదంలోనూ అతడి తల్లిదండ్రులు అవయవదానానికి ముందుకు రావడంతో ముగ్గురి ప్రాణాలు నిలిచాయి. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసకు చెందిన వాతాడ చిరంజీవులు దపంతులకు ఇద్దరు కుమారులు. ఆరో తరగతి చదువుతున్న చిన్న కుమారుడు యువంత్ జన్మదిన వేడుకలకు సిద్ధమవుతుతున్న తరణంలో అతడికి విపరీతమైన గొంతునొప్పి వచ్చింది. దీంతో వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించారు. మొదట సాధారణ సమస్యగా పరిగణించి, చికిత్స చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో శ్రీకాకుళంలోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. బాలుడ్ని శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లేసరికి ఆరోగ్యం మరింత క్షీణించింది. దీంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు తీవ్రంగా శ్రమించినప్పటికీ బాలుడి ఆరోగ్యంలో పురోగతి కనిపించలేదు. పైగా బ్రెయిన్‌డెడ్ అయినట్టు గుర్తించారు. విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి, అవయవదానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో ఈ సమాచారాన్ని జీవన్‌దాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబుకు తెలిపారు. అతని ఆదేశాల మేరకు బాలుడి శరీరంలో పనిచేస్తున్న రెండు కిడ్నీలు, లివర్‌ను సేకరించారు. జీవన్‌దాన్ ప్రొటోకాల్ మేరకు ఒక కిడ్నీని శ్రీకాకుళం ఆస్పత్రికి, మరో కిడ్నీ, లివర్‌ను విశాఖలోని వివిధ ఆస్పత్రులకు తరలించి, రోగులకు అమర్చారు. ఈ సందర్భంగా అవయవదానానికి ప్రోత్సహించిన వైద్యులు, ముందుకు వచ్చిన బాలుడి తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.



యువంత్(ఫైల్)



బాలుడి తల్లిదండ్రులకు ధ్రువపత్రం అందిస్తున్న దృశ్యం

బీపీ.. షుగర్.. పెరిగిపోతున్నాయ్!

(ఐదో పేజీ తరువాయి)

కిడ్నీవ్యాధి బాధితులు అధికంగా ఉన్నారు. అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించి మందులు వాడకపోవడంతో వ్యాధుల తీవ్రత పెరిగి గుండె జబ్బుల పాలవుతున్నారు. గ్రామాల్లో 104 వాహన సిబ్బంది, సీఈసీ కేంద్రాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు.. ఇప్పటికే వ్యాధులు ఉన్నవారికి పరీక్షలు చేస్తున్నారు తప్ప. ప్రాథమిక దశలో గుర్తించడంలో విఫల మవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

రక్తపరీక్షలు అవసరం



గ్రామాల్లో బీపీ, షుగర్ వ్యాధులను నియం త్రించాలంటే.. ప్రతి మూడు నెలలకోసారి అందరికి బలవంతంగా రక్తపరీక్షలు చేయాలి. దీంతో ప్రాథమిక దశలోనే వ్యాధు లు నియంత్రణ వీలవుతుంది. ప్రాథమిక లక్షణాలు గుర్తిస్తే.. జాగ్రత్త పడే అవకాశం ఉంది. వీటి నివారణ పై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలి.

- కె.గణపతి, బోటనీ లెక్చరర్, వజ్రపుకొత్తూరు

సర్వే చేస్తున్నాం



గ్రామాల్లో ఎన్‌సీడీ 3.0 పేరుతో బీపీ, షుగర్ వ్యాధులపై సర్వే నిర్వహిస్తున్నాం. నివేదిక అనంతరం వైద్యశిబిరాలు నిర్వహించి రక్త పరీక్షలు చేస్తాం. పీహెచ్‌సీల్లో ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నాం. '104' వా హనం ద్వారా ప్రతినెల ఆయా గ్రామాల్లోనే ఆరోగ్య తనిఖీలు చేస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వ్యాధగ్రస్తులతో పాటు 30 ఏళ్ల పైబడిన వారు ప్రతి మూడు నెలలకు పరీక్షలు చేసుకుంటే ప్రాథమిక దశలోనే బీపీ, షుగర్‌ను నియంత్రించవచ్చు.

- డాక్టర్ విజయకుమార్ రెడ్డి, అక్కుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు

ఎలా వండాలి.. ఎక్కడ్నుంచి తేవాలి?

(ఐదో పేజీ తరువాయి)

రోజుల్లో సాంబారు, పప్పు, ఇతర కూరగాయలతో వంట చేసి భోజనం పెట్టాలి. ఈ మేరకు ప్రభుత్వం ఒక్కొక్కరికీ 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, ఐదు గ్రా ముల నూనె చొప్పున ఇస్తోంది. దీంతోపాటు కూరగాయలకు రూ.1.25, పోపులకు 25పైసలు, గ్యాస్‌కు 50పైసలు చొప్పున కేటాయిస్తోంది. కాగా గతేడాది మార్చి నుంచి ఈ బిల్లులను ఇవ్వకపోవడంతో నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ప్రభుత్వం నిర్ణయించిన బిల్లులు ఏమాత్రం చాలడం లేదని పేర్కొంటున్నారు. మూడేళ్ల నుంచి బిల్లులు పెంచాలని కోరుతున్నా.. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోతున్నారు. సకాలంలో నిధులు మంజూరుకాకపోవడంతో నిర్వహణ ఎలా సాగించాలని ఆవేదన చెందుతున్నారు. నిత్యావసర సరుకులు ఎక్కడి నుంచి తేవాలని పేర్కొంటున్నారు. నిధులు లేకపోవడంతో అప్పు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి పతినెలా బిల్లులు సక్రమంగా అందజేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బడ్జెట్ వచ్చింది

గతేడాది మార్చి వరకు పెండింగ్ బిల్లులు అందజేశాం. గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకూ ఉన్న బకాయి బిల్లులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికి సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేశాం. త్వరలో అంగన్‌వాడీ కార్యకర్తల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం.

- విమలరాణి, సీడీపీవో, పాతపట్నం ప్రాజెక్ట్

తర్లాకోట.. చెదిరిన ఆనవాళ్లు



పిచ్చిమొక్కల నడుమ తర్లాకోట సింహద్వారం

● చారిత్రక కట్టడం కనుమరుగు
● విలువైన సంపద దొంగలపాలు
● గుప్తనిధుల కోసం కోట ధ్వంసం
● పరిరక్షించాలని కోరుతున్న ప్రజలు

పలాస, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆ కోట జమీందారుల కళావైభవానికి ప్రతీక. నాటి రాచరిక, జమీందారి వ్యవస్థకు అద్దంపట్టేది. అలాంటి కోట నేడు నామరూపాలు లేకుండా మారిపోయింది. ఇక్కడున్న విలువైన సంపదంతా దొంగలపరమైంది. గుప్తనిధుల కోసం కోటంతా తవ్వకాలు చేపట్టడంతో ప్రధాన భాగమంతా ధ్వంసమైంది. ఒక్క జగన్నాథస్వామి ఆలయం మాత్రమే నాటి జమీందార్ల కళా వైభవానికి గుర్తుగా మిగిలిపోయింది. ఇదీ పలాస మండలంలోని తర్లాకోట పరిస్థితి. పలాస మండలం కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో తర్లాకోట ఉంది. దీనికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఒడిశా ప్రాంతాన్ని కళింగరాజులు పాలించేవారు. పూరీ నుంచి పర్లాకిమిడి సంస్థానం వరకూ కళింగ సామ్రాజ్యం ఆధీనంలో ఉండేది. ఈ సంస్థానాన్ని సూర్యవంశ రాజులే ఎక్కువగా పాలించేవారు. ఒడిశా గజపతి రాజులకు సామంతులుగా గిరిజన రాజులే ఉండేవారు. పర్లాకిమిడి రాజులు మందస సంస్థానంలో కప్పం తీసుకువెళ్లడానికి వచ్చి తర్లాకోట జమీందారి కోటలో నివసించే వారని చరిత్ర చెబుతోంది. క్రీస్తుశకం 1040 నుంచి సురో వంశస్తులే తర్లాకోట జమీందారులుగా వ్యవహరిస్తూ ఈ ప్రాంతాన్ని పాలించేవారు. రాచరికాలు రద్దయి ప్రజాపాలన ఏర్పడిన నుంచి తర్లాకోట కళావైభవం కనుమరుగవుతూ వచ్చింది. వేలాది ఎకరాల భూములు ఈ సంస్థానం ఆధీనంలో ఉన్నా ఇక్కడ పాలించే రాజవంశీయులకు కనీసం తిండికి కూడా కష్టమవుతున్న పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో ఉన్న రూ.కోట్లాది విలువైన ఆస్తులన్నీ ఒకనాడు తర్లాకోట జమీందారులవే. తర్లాకోటలోని కట్టడాలు ప్రస్తుతం పూర్తిగా శిథిలమయ్యాయి. సింహద్వారాలు, కోట, నీటికొలను, జగన్నాథస్వామి ఆలయం, రాధాకాంత ఆలయం, శివ, ఆంజనేయ మందిరాలు ఇవన్నీ ఆలనాపాలనా లేక చీకట్లోనే మగ్గిపోతున్నాయి. తర్లాకోటలో విలువైన వస్తువులన్నీ దొంగలపాలయ్యాయి.

గుప్తనిధి కోసం కోటనంతా తవ్వి చరిత్ర స్మృతులను ధ్వంసం చేశారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన తర్లాకోటకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎంతో మంది ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఈ కోటను ప్రభుత్వ గురుకుల పాఠశాలగా తీర్చిదిద్దాలని 25 ఏళ్ల కిందట అప్పటి రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా కార్యరూపం మాత్రం దాల్చలేదు. ఇప్పటికైనా తర్లాకోటను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

చరిత్రకు సాక్ష్యంగా జగన్నాథ మందిరం

తర్లాకోటలో జగన్నాథ మందిరం ఒక్కటే చరిత్రకు సాక్ష్యంగా నిలిచింది. ఈ ఆలయాన్ని తూర్పుగాంగులు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. పూరీ క్షేత్రాన్ని పోలిన విధంగా ఇక్కడ మందిరం నెలకొల్పడం విశేషం. జిల్లాలో ఎక్కడా లేని శిల్పకళా వైభవం ఈ ఆలయం సొంతం. జగన్నాథ రథయాత్ర రోజు ఇక్కడ ప్రజలు యాత్రను జరుపుకుంటూ నాటి వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుంటారు. మిగిలిన రోజుల్లో స్థానికుల దయాదాక్షిణ్యాల మీదే ఆలయం నిర్వహణ జరుగుతుంటుంది.



చరిత్రకు సాక్ష్యం జగన్నాథ స్వామి మందిరం

ఎచ్చెర్ల.. కంపు కంపు!

- జనావాసాల్లో మురుగు నిల్వ
- రోజుల తరబడి రోడ్లపై పేరుకుపోతున్న చెత్త
- అయినా పట్టని అధికారులు



మెండ వీధిలో మురుగు నీరు ఇలా..

శ్రీకాకుళం అర్బన్/ఎచ్చెర్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. ప్రధానంగా పంచాయతీ అధికారుల నిర్వహణ లేకపోవడంతో వీధులు కంపు కొడుతున్నాయి. రోజుల తరబడి చెత్త నిల్వలు పేరుకుపోతున్నా, తొలగించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త, మురుగు నీరు వల్ల ఇళ్ల నుంచి రోడ్డుపైకి రావాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. ప్రధానంగా మెండ వీధి, సాయినగర్‌కాలనీ, ఎస్సీకాలనీ, ప్రగతినగర్ కాలనీల్లో రెండురోజులుగా చెత్త పేరుకుపోయిందని చెబుతు న్నారు. దశాబ్ద కాలం కిందట నిర్మించిన కాలువలు కావడం, పలు చోట్ల కప్పబడిపోవడంతో మురుగునీరు జనావాసాల్లోకి చేరుతోంది. పారిశుధ్యపనులు చేపట్టాల్సిన కార్మికులు పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది.



సాయినగర్‌కాలనీలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ఇటుకలు రాలిపడి.. శ్లాబు ఊడిపోయి

- ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరిన వైనం
- ఇదీ బుడంబోరామకృష్ణాపురం వద్ద విశ్రాంతి భవనం పరిస్థితి



బుడంబో రామకృష్ణాపురం వద్ద అర్థాంతరంగా పనులు నిలిచిపోయిన విశ్రాంతి భవనం

హరిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని సాబకోట రోడ్డులో బుడంబో రామకృష్ణాపురం వద్ద విశ్రాంతి భవనం పనులు ఆరేళ్లుగా అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో భవనం శ్లాబు ప్లేట్లు, ఇటుకలు రాలిపడుతున్నాయి.అప్పట్లో రూ.రెండు లక్షలతో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించాలని పనులు చేపట్టారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ముందుకు సాగలేదు.ఇక్కడ నవరరాజపురం, బుడుంబోకాలనీ తదితర ఆరు గ్రామాల గిరిజనులు, విద్యార్థులు మందస, సాబకోట, పలాస తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రతిరోజూ వెయ్యి మంది వరకూ వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రూట్‌లో పలాస ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు కూడా నడుస్తున్నాయి. అయితే బుడంబో రామకృష్ణాపురం వద్ద షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండి వానకు తడాల్సివస్తోందని గిరిజనులు వాపోతున్నారు. పనులు ప్రారంభించి ఆరేళ్లు దాటుతున్నా పూర్తికాకపోవడంతో ఇటుకలు రాలిపోవడంతో పాటుశ్లాబు ఊడిపోతోంది.దీంతోపాటు మండలంలో మరో ఆరు చోట్ల విశ్రాంత భవనాలు కూడా అర్థాంతరంగా నిలిచిపోయాయి. మందస మండలకేంద్రంలోకూడా కనీసం ప్రయాణికులు తలదాచుకునేందుకు విశ్రాంతి భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలకేంద్రంలోపాటు అర్థాంతరంగా నిలిచిపోయిన విశ్రాంతి భవనాల పనులు పూర్తిచేసి అవస్థలు తీర్చాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బూర్జ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం బూర్జలో శ్రీకాకుళం డివిజన్‌లోని 13మండలాల రెవెన్యూసిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల వివిధగ్రామాల్లో జరిగిన గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో మాట్లాడి సమస్యలకు అడిగితెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు ఇవ్వనివారు కూడా వీటికి సంబంధించి సమస్యలుంటే తహసీల్దార్ కార్యాలయం, సచివాలయంలోనూ భూహక్కు సర్వేనెంబర్లతో సహా సరైన ఆధారాలతో దరఖాస్తుచేస్తే వాటిని పరిశీలించి 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో ప్రత్యూష రాణి, తహసీల్దార్లు, డీటీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొజ్జిరియా జంక్షన్‌లో బియ్యం స్వాధీనం

కవిటి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొజ్జిరియా జంక్షన్ వద్ద జాతీయరహదారిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారని సోమవారం సీఎస్‌డీటీ కె.సంతోష్‌కుమార్ తెలిపారు. జాతీయరహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా వాహనంపై తరలిస్తున్న 3,380 కేజీలు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. విజిలెన్స్ ఎస్‌ఐ పి.రామారావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా 70 బస్తాల బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. డ్రైవర్ సాలిన లక్ష్మణ్‌ను విచారించగా కంచిలిలోని కె.నాగరాజుకు చెందిన బియ్యం ప్యాకెట్లుగా తెలియజేశారని చెప్పారు. వాహనం యజమాని ఎం.అప్పలస్వామిగా గుర్తించామని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి ఇచ్ఛాపురంలోని గోదాముకు బియ్యం తరలించామని చెప్పారు.

బొరివంకలో పరిషత్ నాటిక పోటీలు



నాటిక పోటీలో కళాకారులు ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొరివంకలో సోమవారం పరిషత్ నాటిక పోటీలు నిర్వహించారు. కళింగసీమ కళాపీఠం ఆధ్వర్యంలో బల్లెడ అనసూయమ్మ స్మారక ఆహ్వానిత తెలుగురాష్ట్రాల నాటిక పోటీలు చివరిరోజు పలు నాటికలను ప్రదర్శించారు.ఈ సందర్భంగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం, సౌజన్య కళా స్రవంతి ఉత్తరాంధ్ర వారి దేవరాగం,కింతలి వారి సౌజన్యంతో శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం బొరివంక వారు కొత్తపరిమళం నాటిక ఆకట్టుకుంది. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎం.సత్యనారాయణ, కె.బ్రహ్మానందం, కేవీ మంగరావులు వ్యవహరించారు.

చిన్నపరిశ్రమల గుర్తింపు

- పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ విజయరత్నం



పొందూరులో దుకాణాల వద్ద సర్వే చేస్తున్న అధికారులు

పొందూరు,ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 10 : చిరువ్యాపారులు, చిన్న హోటళ్లతో పాటు, చిన్న పరిశ్రమలను సర్వే ద్వారా గుర్తించనున్నట్లు పరిశ్రమలశాఖ జనరల్‌మేనేజర్ విజయరత్నం తెలిపారు.సోమవారం పొందూరులో ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమలశాఖ, స్థానిక అధికారుల సహకారంతో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వే ద్వారా అందజేస్తున్న గుర్తింపుకార్డులతో చిన్నవ్యాపారులకు ప్రయోజనాలు ఉంటుందని తెలిపారు.పరిశ్రమల స్థాపన, వ్యాపారులు, చిన్నపరిశ్రమలు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం విధానాలు దగ్గర చేసేందుకు సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. సర్వేలో పరిశ్రమలశాఖ డీడీ ఉమామహేశ్వరి, ఏడీ రఘునాథ్, ఎంపీడీవో మన్మథరావు, ఈవో మోహన్‌బాబు ఉన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో గుర్తింపు తీసుకురావాలి: వీసీ

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):అఖిల భారత మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని కోరారు. ఈ మేరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల యూనివర్సిటీ ఈనెల 14 నుంచి మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు వర్సిటీ తరపున శ్రీకాకుళంలోని పలు కళాశాలలకు చెందిన జి.హర్షిత, డి.హేమశ్రీ, ఎస్.ఝాన్సీలక్ష్మి హాజరుకానున్నారు. ఈమేరకు వారికి వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాతతో కలిసి వీసీ అభినందించారు.

బైపాస్ ఏర్పాటు చేయండి



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

రణస్థలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జేఆర్‌పురంలో జాతీయ రహదారిపై నిర్మించతలపెట్టిన ఫ్లైఓవర్ నిలిపివేయాలని వ్యాపారులు కోరారు.ఈ మేరకు సోమవారం జేఆర్‌పురంలో వ్యాపారులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కార్యాలయంలో రెవెన్యూ అధికారి డి.మూర్తికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారి పనులకు సంబంధించిన సర్వేలు వ్యాపారులు, ప్రజలతో చర్చించకుండా నిర్వహించడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. బైపాస్ ఏర్పాటు చేస్తే రణస్థలం అభివృద్ధితో పాటు తమకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యాపారులు డీజీఎం ఆనందరావు, ఈ.తిరుపతిరాజు, పిన్నింటి సత్యంనాయుడు, సుధ, చుక్క శ్రీనివాసరావు, గంగి హరి పాల్గొన్నారు.

జీవన ధ్రువపత్రం సమర్పించాలి

ఆమదాలవలస, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్రాంత పెన్షనర్లు ఈనెల 28లోగా ఎస్‌టీవో కార్యాలయంలో, ఏదైనా నెట్‌సెంటర్లు, మొబైల్‌లో గాని జీవన ధ్రువప త్రాలు సమర్పించాలని ఎస్‌టీవో ఎస్.సువర్ణరాజు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన పెన్షనర్లు సంఘ నాయకులకు గాని, ఎస్‌టీవో కార్యాలయానికి గాని తెలియజేస్తే కార్యాలయ సిబ్బంది వారి ఇంటికి వచ్చి జీవన ధ్రువపత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

- పీయూసీ చైర్మన్ కూన రవికుమార్



సరుబుజ్జిలి: కొత్తకోటలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే పునాది అని, వారి సంక్షేమానికే పార్టీ ప్రాధాన్యతనిస్తుందని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవి కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని కింతలి, మొదలవలస, గంగ్రేడు తదితర గ్రామాల్లో టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు పైడి రామప్రసాద్, కె.హనుమంతురావు, లోకనాధం, సీతారామరాజు, తమ్మినేని జనార్ధనరావు, వెంకటరావు తదితరులు ఉన్నారు.

●సరుబుజ్జిలి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి):ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన టీడీపీ నాయకులు,కార్యకర్తల కుటుంబసభ్యులను సోమవారం ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శించారు. ఆమదాలవలస మండలంలోని కనుగులవలస, ముద్దాడపేట, తమ్మయ్యపేట, పొన్నాంపేట, సరుబుజ్జిలిమండలంలోని కొత్తకోట, రావివలసల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలతో మాట్లాడారు.

●జి.సిగడాం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి):ధవళపేట మాజీ సర్పంచ్, విజయనగరం పార్లమెంట్ టీడీపీ బీసీ అధికార ప్రతినిధి కంచరాన సూరన్నాయుడు మాతృమూర్తి అమ్మాయమ్మ ఇటీవలమృతిచెందడంతో ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ మేరకు జి.సిగడాం, పొందూరు టీడీపీ మండలాధ్యక్షులు కుమరాపు రవికుమార్, చిగురుపల్లి రామ్మోహన్‌రావు పరామర్శించి అమ్మాయమ్మ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

భక్తిభావాన్ని అలవరచుకోవాలి: ఎమ్మెల్యే



శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గొండు శంకర్

అరసవల్లి,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవరచుకోవాలని శ్రీకాకుళంఎమ్మెల్యే గొండుశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాకుళం నగరపాలకసంస్థలోని 51వ డివిజన్‌లోగల షిర్డీబాబా మందిరంలో శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినిసూచించే విధంగా మనిషి సన్మార్గంలో మనుగడ సాగించాలన్నారు. దేవాలయాల వల్ల సనాతన ధర్మంవృద్ధి చెందుతుందనితెలిపారు.సనాతన హిందూసంప్రదాయంలో దేవాలయాలు విలువలతోకూడిన సమాజనిర్మాణంలో ప్రధానపాత్ర పోషించాయని చెప్పారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుప్పలవలసలోని బాలురు, ఎచ్చెర్లలోని బాలికల పాఠశాల/కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరాల్లో భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు బోర బుచ్చిరాజు, బి.లక్ష్మి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పాఠశాల/కళాశాల్లో ఐదో తరగతిలో చెరో 80 సీట్లు, ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీలో కలిపి చెరో 80 సీట్లు చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల ఆరో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్‌లో చేరేందుకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకోసం ఫోన్‌నెంబర్లు 87909 39186, 90141 27134కు సంప్రదించాలని కోరారు.

ఇచ్ఛాపురంలోనే సేవలందించండి

- ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల డిమాండ్



నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ నాయకులు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఎంవీఐ కార్యాలయంలోనే సేవలందివ్వాలని భగవతి శ్రీ స్వేచ్ఛావతి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్‌చేశారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన రూల్స్ వల్ల ఆటోవాలాలకు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈమేరకు ఇచ్ఛాపురంలోని ఎంవీఐ కార్యాలయం బయట నిరసన తెలిపి ఎంవీఐ ఆర్.గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్లుగా స్థానిక ఎంవీఐ కార్యాలయంలోనే ఆటోలు రిజిస్ట్రేషన్లు, రికార్డులు, లైసెన్స్‌లు, ఫిట్‌నెస్ సేవలు అందుతున్నాయని తెలిపారు. ఇప్పుడు ఈ సేవలు ఇక్కడ రద్దు చేసి 120 కిలోమీటర్ల దూరంలోని ఎచ్చెర్లకు మార్చడంతో ఆటో డ్రైవర్లకు శ్రమతో కూడిన పని అని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని తెలిపారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాల్లోని వేల సంఖ్యలో ఆటో డ్రైవర్లు ఇబ్బందిపడాల్సివస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కవిటి, ఈదుపురం, డొంకూరు, లొద్దపుట్టిలోని ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బడే మోహన్, పి.హరి,ఎర్రయ్యరెడ్డి, తిరుమల, భాస్కర్, శేఖర్, చంద్రయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు. సోమవారం ధర్మపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థు లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎస్.విశ్వనాథం, శంకరరావు పాల్గొన్నారు.

నేడు హుండీల లెక్కింపు

అరసవల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) :అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దేవాలయంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈవో భద్రాజీ తెలిపారు. వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అ ర్చకులు ఇప్పిలి శంకరశర్మ పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోండి

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ఈనెల 28లోగా 2025-26 ఏడాదికి సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ పీవీవీ ప్రసాద రావు తెలిపారు. సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో వ్యాపారులతో కమిషనర్ సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూస్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివాస్‌లో భాగంగా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా నిర్వర్తించాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌పై వెబినార్

గుజరాతీపేట,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కేంద్ర బడ్జెట్‌పై జాతీయ వెబినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు రిజిస్ట్రార్ ఎ.లీలామోహన్,కళాశాలప్రిన్సిపాల్ కె. సూర్యచంద్రరావు దేశ అభివృద్ధికి ఎంతోగానో ఈ బడ్జెట్ తోడ్పటునందిస్తుందని వివరించారు. అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విభాగాధిపతి టి.ఆదిలక్ష్మి, బి. ప్రభాకర్, పి.శంకరరావు, రిసోర్స్ పర్సన్ జెట్టి పాండు రంగారావు పాల్గొన్నారు.

బలివాడలో పరిసరాల పరిశుభ్రత

శ్రీకాకుళం రూరల్,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):బలివాడలో మూడు రోజులుగా సర్పంచ్ వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో పరిసరాలపరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నారు.సోమవారం మురుగు కాలువల పూడికతీత పనులతో పాటు,రోడ్లపై పెరిగిపోయిన మొక్కల తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్‌పీ సమత పాల్గొన్నారు.

మద్యం మత్తులో హత్య

- భార్యను గొడ్డలితో నరికి చంపిన వృద్ధుడు

సోంపేట/కంచిలి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 10: సోంపేట మండలం జింకిభద్రలో సోమవారం రాత్రి ఓ వృద్ధుడు మద్యం మత్తులో భార్యను హత్యచేశాడు. సోంపేట పోలీసుల కథనం మేరకు.. సోంపేట మండలంలోని జింకిభద్రకు చెందిన సాహుకారు డిల్లేశ్వరరావు బెంకిలిలో టీషాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు కాగా, ఒకరు మృతి చెందారు. రెండో కుమారుడితో కలిసి ఉంటున్నారు. జింకిభద్రలో ఓ ఇంటిలో పైన కుమారుడు తన కుటుంబంతో ఉండగా దిగువన డిల్లేశ్వరరావు రత్నాలు ఉంటున్నారు. సోమవారం రాత్రిమద్యం తాగివచ్చి డిల్లేశ్వరరావు తన భార్య రత్నాలు(70)తో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య గొడవ పెద్దదికావడంతో కోపంలో పక్కనే ఉన్న గొడ్డలితో భార్యను నరికేయడంతో రక్తస్రావం కావడం వల్ల అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన డిల్లేశ్వరరావు ఇంటిపైన ఉన్న కుమారుడు వద్దకు వెళ్లి తల్లితో గొడవపడి కొట్టినట్లు చెప్పాడు. ఆయన వచ్చి చూసేసరికి ఆమె మృతి చెందింది. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోంపేట సీఐ బి.మంగరాజు, ఎస్ఐ వి.లవరాజు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డిల్లేశ్వరరావును అదుపులోకి తీసుకోగా గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. కుమారుడు దివాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.లవరాజు తెలిపారు.

సంతోషిమాత ఆలయంలో యాగాలు



శ్రీకాకుళం కల్చరల్: పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళంలో గల సంతోషిమాత ఆలయంలో మూడు రోజులపాటు యాగ మహోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా చండీమండప పూజలుజరిగాయి. అర్చకులు కిరణ్‌శర్మ ఉద్యాపన పూజలు నిర్వహించారు.

దుర్గాదేవి ఆలయంలో..

జి.సిగడాం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సంతవురిటిలో దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తలు సుధా లక్ష్మణరావు ఆదిలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు హోమాలు చేశారు.భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, ముర్రాటలు చెల్లించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేణుగోపాలస్వామి హుండీ ఆదాయం 15.22 లక్షలు.

గార ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శాలిహుండం కొండపై వెలసిన వేణుగోపాలస్వామి వారి భీష్మ ఏకాదశి యాత్ర ఆదాయం రూ.15.22 లక్షలు వచ్చిందని ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ హుండీల ద్వారా రూ.5.52 లక్షలు, ప్రసాదం విక్రయం ద్వారా రూ.60 వేలు ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.3.12 లక్షలు అభిషేకం టికెట్ల ద్వారా రూ.5.95 లక్షలు రూ. కేశఖండన ద్వారా రూ.2.160 ఆదాయం వచ్చిందని చెప్పారు.

● ఆమదాలవలస, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, ఉమారామలింగేశ్వరాలయంలో హుండీలను ఈవో తమ్మినేని రవి, శ్రీకాకుళం భీమేశ్వరాలయానికి డిప్యూటీ ఈవో చెందిన పి.మాధవి ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ద్వారా పది నెలలకు రూ.2 లక్షలు 13 వేల 200 రాగా, ఉమారామలింగేశ్వరాలయంలో రెండు సంవత్సరాలకు రూ.80,111 వచ్చినట్టు తెలిపారు.

మల్లికార్జున స్వామి తలపాగాకు తిరువీధి

లావేరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):లావేరులో మల్లికార్జున స్వామి తలపాగాతో సోమవారం తిరువీధి నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు 366 మూరల పొడవు, 18 అంగుళాల వెడల్పుతో తలపాగను లావేరులోని చేనేత కార్మికులు కాశిన వెంకటరమణ, నవ్రరాజు తయారుచేశారు. బ్రహ్మాత్సవాల్లో భాగంగా దీన్ని సమర్పించనున్నారు. తలపాగకు సోమవారం లావేరు శివాలయంలో పూజలు చేసి తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ .తోటయ్యదొర, లంకలపల్లి శ్రీను, కాశిన వీర్రాజు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గంజాయి కేసులో ముద్దాయికి నాలుగేళ్ల జైలు శిక్ష

పలాస, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఓ వ్యక్తికి నాలుగేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయాధికారి పి.భాస్కరరావు సోమవారం తీర్పు ఇచ్చినట్లు పలాస రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. 2024లో ఒడిశా రాష్ట్రం గండాహతికి చెందిన బసంత్‌పరిచ్చా అనే వ్యక్తి పలాస రైల్వే స్టేషన్‌లో గంజాయిని తరలిస్తుండగా అతనిపై కేసు నమోదు చేసి విశాఖపట్నం కోర్టులో హాజరు పరిచామన్నారు. వాదోపవాదాలు శ్రీకాకుళం కోర్టులో జరిగిన అనంతరం ముద్దాయి బసంత్‌పరిచ్చాపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారన్నారు. ఈ కేసులో పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రీనివాసరావు వాదించినట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలు

నందిగాం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాపుతెంబూరు జంక్షన్ సమీపంలో హైవేపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. టెక్కలి నుంచి పలాస వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న టెక్కలి కండ్ర వీధికి చెందిన సులోచన బెహరా, ప్రతాప్ కాపుతెంబూరు నుంచి రహదారి ఎక్కుతున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108 వాహనం లో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. నందిగాం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

● మృతురాలి స్వస్థలం ఇచ్ఛాపురం

గాజువాక (విశాఖపట్నం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని గాజువాక సమీపం శ్రీనగర్ జంక్షన్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన కొణతాల ఉషారాణి (22) విశాఖ రైల్వే స్టేషన్‌లో ట్రైన్ దిగింది. అక్కడ నుంచి తమ కుటుంబ సభ్యునితో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీనగర్ బయలుదేరింది. ఈ క్రమంలో శ్రీనగర్ కూడలి వద్దకు వచ్చేసరికి వెనక నుంచి వచ్చిన ఓ లారీ బలంగా వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ చక్రాల కింద ఉషారాణి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే బగ్గు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముద్దాడ దమయంతి భైరాగినాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ వల్ల హామీ ఇవ్వలేకున్నానని, కోడ్ అనంతరం తన క్యాంపు కార్యాలయంలో వినతులు సమర్పించాలని కోరారు. ఇప్పటికే సీసీ, బీటీ రహదారులు నిర్మించామన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరందించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సమావేశంలో జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీడీవో రవికుమార్, ఉపాధ్యక్షులు కలదండు తాతారావు, కోట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక స్థైర్యం కలిగి ఉండాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ సతీష్

హరిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక స్థైర్యాన్ని కలిగి ఉండాలని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ మాకిన సతీష్ అన్నారు. కుంటి కోట నారాయణ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ప్రేరణాత్మక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యసాధన, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. సంఘర్షణల నుంచి విజయం, విద్యార్థులు మానసికంగా బలంగా ఉండడం, సమయపాలన విలువ ఎంత తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ గుంట రోహిణీ శంకర్, అరవింద్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుబారిన పడితే జీవితాలు ఛిద్రం



మాట్లాడుతున్న ఎస్ఐ లావణ్య

పాతపట్నం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మత్తుబారిన పడితే జీవితాలు ఛిద్రమవుతాయని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. ఆర్ఎల్‌పురంలో 'సంకల్పం' లో భాగంగా సోమవారం వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. గంజాయి తీసుకున్నా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత సైబర్ నేరగాళ్ల బారినపడి తీవ్రంగా నష్టపోతున్నారని, వీటికి దూరంగా ఉండాలన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి చిత్రపటం వద్ద సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. దేవునల్తాడ, కొత్తపేట, పల్లివూరు పంచాయతీల్లో ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఆమెతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, గుల్ల చిన్నారావు, గోవిందు పాపారావు, వంక రామారావు ఉన్నారు.

ఈ మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

● కనీస హెచ్చరిక బోర్డులు లేవు



పలాస రూరల్: కేదారిపురం నుంచి ఈదురాపల్లి వెళ్లే మార్గంలో మలుపు



హరిపురం: బహాడపల్లి వద్ద ఉన్న మలుపు

పలాసరూరల్/హరిపురం,ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాలకు వెళ్లే మార్గాల్లోని మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీస హెచ్చరికలు లేకపోవడంతో ఎదురుగా దగ్గరకు వచ్చే వరకు వాహనాలు కనిపించడం లేదని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా పలాస మండలం కేదారిపురం నుంచి ఈదురాపల్లి వెళ్లే మార్గంలో కొండ మలుపు వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉంది. అలాగే మందస మండలం బహాడపల్లి వద్ద కూడా మలుపు దారుణంగా ఉంది. ఈ మార్గాల్లో పయనించాలంటేనే ప్రజలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. మలపులకు ఇరువైపులా ఎటువంటి హెచ్చరిక బోర్డులు కాని, రేడియం మార్కింగ్‌లు గాని లేకపోవడంతో రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయాలబారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

పోలాకి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి స్కూల్ గ్రిక్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థినులను ప్రతిభ కనబరిచినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం ప్రతిభ కనపరచిన క్రీడాకారులను అభినందించారు. ఎం.తనుశ్రీ, పి.ఝాన్సీ, పి.తేజేశ్వరి, జి.యశస్వి, ఎం.తను, ఝాన్సీ ప్రతిభ కనపరిచారన్నారు. కార్యక్రమంలో పీడీ ఎం.నీలం, విద్యాకమిటీ చైర్మన్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సేవలందించాలి



వినతిపత్రం ఇస్తున్న సీనియర్ సిటిజన్లు

టెక్కలి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సేవలందించాలని ఆ సంఘ నాయకులుకోరారు. ఈ మేరకు సోమవారం మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో వృద్ధుల శ్రేయస్సు, సౌకర్యాలను నిర్ధారిస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినందున వాటికి అనుగుణంగా ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించాలని కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలో దీపికకు కాంస్యం



కాంస్య పతకం అందుకుంటున్న దీపిక

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్ పోటీలో ఉప్పరపేట గ్రామానికి చెందిన చెన్నంశెట్టి దీపిక 30 కేజీల కరాటే విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ పోటీలు సోమవారం విజయవాడలోని చెన్నుపాటి మున్సిపల్ స్టేడియంలో స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను శిక్షకుడు గౌతమ్‌కుమార్, మల్లికార్జునగౌడ్, కళింగకోమటి సంఘం అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, జిల్లా రైస్‌మిల్లుల సంఘం అధ్యక్షుడు బోయిన రమేష్ తదితరులు అభినందించారు.

ఇంటి పన్నులు వసూలు చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఎస్.రామారావు ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మార్చి నాటికి ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు సకాలంలో నిర్వహించాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. ఆయన వెంట సచివాలయ పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతులను గుర్తించాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి

నరసన్నపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేసి విభిన్న ప్రతిభావంతులను గుర్తించాలని నరసన్నపేట జూనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ అన్నారు. ఉర్లాం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రతంగా ఉంచు కోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం గురించి వైద్యాధికారి సుజాత వివరించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి దివ్యాంగుల వివరాల సేకరణ

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో దివ్యాంగులను, మానసిక దివ్యాంగ బాలబాలికలను గుర్తించి ఆ వివరాలను ఏరోజుకు ఆరోజు మండల సేవాసంఘానికి అందించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. మంగళవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు మండలాల్లో మూడు బృందాలుగా ఏర్పడి దివ్యాంగుల వివరాలు నమోదు చేస్తారన్నారు. వీటి ద్వారా ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, న్యాయసేవలు కావాలా అన్న వివరాలు తెలు స్తాయన్నారు.

గిరిజనులను చులకనగా చూడడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సవర రాంబాబు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనులను చులకనగా చేసి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడడం తగదని, ఆ మాటలను వెనక్కు తీసుకోవాలని గిరిజన సంఘాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజనులకు వజ్రాయుధమైన 1/70 యాక్ట్ నిర్వీర్యం చేసేందుకు చూస్తుండడం తగదన్నారు. అవసరమైతే గిరిజన చట్టాలను పటిష్టం చేయాలే తప్ప ఇలా వారిని కించపరిచేలా మాట్లాడడం దారుణమన్నారు. ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి వారితో పరిశ్రమలు ఏర్పాటు చేయించి ప్రోత్సహించాలన్నారు. టూరిజం ప్రాంతాల్లో గిరిజనులతో స్టాల్స్, హోటల్స్ పెట్టించే ఏర్పాటు చేయాలన్నారు. అయ్యన్నపాత్రుడు మాటలను నిరసిస్తూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మన్యం జిల్లాలో మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్న బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, జగ్గారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

● డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ



హిరమండలం: సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

జలుమూరు/హిరమండలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించి విధులను బాధ్యతగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో టీవీ బాల మురళీకృష్ణ ఆదేశించారు. అచ్యుతాపురం, హిరమండలం పీహెచ్‌సీలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోగులకు ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా మెరుగైన సేవలు అందించాలన్నారు. రోగులకు అందుబాటులో ఉంటే ఓపీ పెరుగుతుందన్నారు. ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. మందుల గదులు, ఆక్సిజన్ సిలిండర్లు రికార్డులను పరిశీలించారు. అసం క్రమిత వ్యాధులు, ఎన్‌సీడీసీ సర్వేలకు సంబం ధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు శ్రీముఖలింగంలోని ముఖ లింగేశ్వర స్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యే క పూజలు చేశారు. కార్యక్రమాల్లో వైద్యాధికారి పి.సుజాత, డీపీఎంవో వాన సురేష్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత నీరందించేలా చర్యలు



పంపుహౌస్ బావిని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీధర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హిరమండలం, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): హిరమండలంలో రక్షిత నీటి పథకం నుంచి సురక్షిత నీటిని కొళాయిల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో కేవీఎస్ శ్రీధర్ అన్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఈ నీటినే తాగ మంటారా?' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. రక్షిత నీటి పథకం ట్యాంకుతో పాటు పవర్ హౌస్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీప్రసాదరావు, ఈవోపీ ఆర్డీ గోవిందరావు, ఈవో హరికృష్ణ ఉన్నారు.

చెత్తకుప్పలు తొలగించారు..



హరిపురం-బాలిగాం కూడలిలో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

హరిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): హరిపురం-బాలిగాం కూడలిలో రోడ్డుకు ఇరు వైపులా వేసిన చెత్తను పంచాయతీ అధికారులు తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'దుర్గంధం' శీర్షికతో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి పనులు చేయించారు. ఆయా ప్రాంతాల్లోని చెత్త కుప్పలను సుదూర ప్రాంతాలకు తరలించి బ్లీచింగ్ చల్లారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పనులను ఎంపీడీవో రమేష్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

హిరమండలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పిల్లలందరికి నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని జడ్పీ సీఈవో కేవీఎస్ శ్రీధర్ అన్నారు. సోమవారం డీవార్మింగ్ డే సందర్భంగా హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే ప్రక్రియను పరిశీలించారు. 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరూ ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. ఎంపీడీవో కాశీప్రసాదరావు, ఎంఈవో కె.రాంబాబు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

అసత్యపు ప్రచారం తగదు

పలాసరూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఓ దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడింది టీడీపీ కార్యకర్త అంటూ ఓ మీడియాలో అసత్యపు ప్రచారం చేయడం తగదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు సోమవారం తన కార్యాల యంలో ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్ప డిన వ్యక్తి టీడీపీకి చెందిన వ్యక్తి బంధువని ఓ పత్రిక (ఆంధ్రజ్యోతి కాదు)లో రావడం దారుణమని, ఇలా ప్రచురించడం ఎంతవరకు సమంజసమన్నారు. బాధితురాలికి అన్యా యం చేసిన వ్యక్తి టీడీపీకి చెందిన వ్యక్తి అని నిరూపిస్తే తాను బహిరంగ క్షమాపణకు సిద్ధమన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మార్చి 6వ తేదీలోగా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉం టుందన్నారు. అలాగే ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షలు వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు. 5వ తగతిలో 80, ఇంటర్‌లో 80 సీట్లు ఉన్నాయ న్నారు. ఇతర వివరాలకు 80966 13777, 957370 5525 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్‌లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీటీ కె.మురళీకృష్ణ హెచ్చరించారు. సోమవారం నగరంపల్లి, వెంకటాపురంలో రేషన్ పంపిణీని పరిశీలించారు. తూనికల్లో మోసాలకు పాల్పడితే వేటు తప్పదన్నారు. రేషన్ కార్డు వినియోగదారులకు సకాలంలో సరుకులు అందించాలన్నారు. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదన్నారు.

వ్యవసాయశాఖ కార్యాలయం నిర్మించాలి

పలాసరూరల్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పలాస వ్యవసాయశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని, ఆధునికీకరించి సదుపాయాలను కల్పించాలని రైతు సంఘ నాయకులు తెప్పల అజయ్‌కుమార్, తమ్మినాన భాస్కరరావు కోరారు. ఈ మేరకు ఆర్డీవో గ్రంథి వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యాలయంలో సరైన సదుపాయాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్షణ గోడ నిర్మించాలని, నూతన భవన నిర్మాణం చేప ట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కె.బాలాజీ, కె.హేమసూదన్, డి. రామకృష్ణ, ప్రసాదరావు, కె.తాతయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక గుర్తింపు నెంబరు పొందాలి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎరువులు, విత్తనాలు, మందుల కోసం భూమి ఉన్న ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు నెంబరును పొందాలని వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు తెలి పారు. రైతులు ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింక్ ఉన్న ఫోన్, పట్టాదారు పాస్‌బుక్ పట్టుకొని రైతు సేవా కేంద్రంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఘనంగా కొత్తమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న కొత్తమ్మతల్లి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కన్నేవలస గ్రామంలో శ్రీ కొత్తమ్మతల్లి దేవాలయ తృతీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మాజీ సర్పంచ్ కాళ్ల గణపతిరావు దంపతులు, గ్రామస్థులతో కలిసి పురోహితులు త్రినాథ పండా, సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, ముర్రాటలు సమర్పించారు. అమ్మ వారి తిరువీధి ఉత్సవం చేప ట్టారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా కోదండ రాముని విగ్రహ ప్రతిష్ఠ

టెక్కలి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పెద్దసానలో నూతనంగా నిర్మించిన కోదండ రామా లయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు విగ్రహ ప్రతిష్ఠతో పాటు సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో బగాది శేషగిరి రావు, దల్లి ప్రసాద్, గురువెల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండ కొత్తవలసలో వీరభద్రస్వామి..



ఆలయంలో అరటి గెలలు కట్టిన దృశ్యం

పోలాకి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గాతలవలస పంచాయతీ కొండకొత్తపేటలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆలయ ప్రారంభం, విగ్రహ పునఃప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద యువజనసేవాసంఘం,, ఎంపీటీసీ యాగాటి లక్ష్మణరావు, సర్పంచ్ మెండ శ్రీనివాసరావు, కొంకి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. భక్తులు అరటి గెలలు కట్టి భక్తిని చాటుకున్నారు.

వైభవంగా లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నదూగాం కూడలిలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈవో రాధాకృష్ణ నేతృత్వంలో అర్చకులు స్వామి వారి కల్యాణం చేపట్టారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

సత్యసాయి మందిరానికి రూ.లక్ష వితరణ

హిరమండలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): హిరమండలం దేవరశెట్టి వీధిలోని సత్య సాయి మందిరం పునర్నిర్మాణానికి వ్యాపారవేత్త అందవరపు సంతోష్ రూ.లక్ష వితరణ అందజేశారు. తన తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఈ విరాళం ఇస్తున్నట్లు సంతోష్ తెలి పారు. చెక్కును సంఘ అధ్యక్షుడు అందవరపు అబ్బాయికి సోమవారం అందించారు. కార్యక్రమంలో బుచ్చబ్బాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.